క్లుప్తంగా

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాగనూర్(మక్తల్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి అన్నారు. ఊట్కూర్ బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన చంద్రశేఖర్‌గౌడ్‌ను శుక్రవారం మక్తల్ పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బలరాంరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు జయనంద్‌రెడ్డి, నల్లె నర్సప్ప, తిమ్మప్ప, బస్వరాజ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలి



మరికల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సీసీరోడ్లు లేక రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వర్షాకాలం వచ్చిందంటే చాలు రహదారులు బురదగా మారడంతో ఇళ్లకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నట్లు కాలనీ ప్రజలు వాపోతున్నారు. సీసీరోడ్లు వేయాలని రెండేళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే వర్షాకాలం నాటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో సీసీరోడ్లు వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సీహెచ్ పట్టివేత.. కేసు నమోదు



మాగనూర్: మండల పరిధిలోని నేరడగండొడ్డి గ్రామ శివారులోని ఈతవనంలో 580 గ్రాముల క్లోరల్ హైడ్రేట్(సీహెచ్)ను శుక్రవారం మహబూబ్‌నగర్ ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీహెచ్‌ను నారాయణపేట ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. నిందితుడు ఈడ్గి అశోక్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి, అతడి తల్లిని సైతం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కవిత, సిబ్బంది పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మాగనూర్(మక్తల్): మక్తల్ పట్టణంలోని జాతీయ రహదారి 167పై రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు రేడియం స్టిక్కర్లు అందజేసినట్లు శుక్రవారం మక్తల్ సీఐ రామ్‌లాల్ తెలిపారు. జాతీయ రహదారిపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడం వలన రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారిపై రైతులు ధాన్యాన్ని అరబెట్టడం, వాహనాలు పార్కింగ్ చేయకూడదని సూచించారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యం



మాగనూర్(మక్తల్):సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఊట్కూర్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన ఆశాబి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్‌గౌడ్, రవి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలించేదెప్పుడో

- బాయిల్డ్ రైస్ మిల్లుల కొరత
- దామరగిద్దలో అధికంగా దొడ్డురకం ధాన్యం
- కేంద్రాలకు రికార్డు స్థాయిలో ధాన్యం



దామరగిద్ద పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం నిల్వలు



అన్నసాగర్ ఐకేపీ కేంద్రంలో ధాన్యం నిల్వలు

దామరగిద్ద: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం విక్రయించేందుకు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు ప్రభుత్వం చివరి గింజవరకు కొంటాం అంటున్నా.. విక్రయించిన ధాన్యం లారీల్లో తరలించి గోడౌన్‌లకు చేరే వరకు రైతులకు బిల్లులు కాని దుస్థితి నెలకొంది. దీంతో కేంద్రాల్లో విక్రయించి తూకం వేసి అక్కడే టార్పలిన్ కవర్లతో కప్పి ఉంచి వారాల తరబడి పగలు రాత్రి కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో వరి ధాన్యం ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, సన్నాలకు బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రైవేటు మార్కెట్‌ల కంటే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు వస్తుండటంతో కొనుగోలు కేంద్రాలకు రికార్డు స్థాయిలో ధాన్యం పోటెత్తుతుంది.

మండలంలో 15 కేంద్రాలు

మండలంలో ఐకేపీ- 10, పీఏసీఎస్- 05 ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో దామరగిద్ద, క్యాతన్‌పల్లి, కంసాన్‌పల్లి, గడిమున్కన్‌పల్లి, వత్తుగుండ్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ పరిధిలోని ఐదు కేంద్రాలకు ఇప్పటి వరకు 85 వేల గన్నీ బస్తాలు అందజేశారు. కాగా ఇప్పటి వరకు 30వేల బస్తాల ధాన్యం మాత్రమే కేంద్రాలకు తరలించారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 కేంద్రాలకు లక్షకు పైగా గన్నీ బస్తాలు పంపిణీ కాగా 40 శాతం ధాన్యం బస్తాలు మాత్రమే కేంద్రాలకు వచ్చింది. దీంతో పూర్తిస్థాయి ధాన్యం కొనే వరకు పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్టోరేజ్ మిల్లులు లేక

మండలంలో బాయిల్డ్ స్టోరేజ్ రైస్ మిల్లులు లేకపోవడం కోస్గి, గుడెబల్లూర్ మరికల్‌లో ఉన్న ఐదు గోదాములు ఇప్పటికే స్టోరేజ్ పూర్తి కావడంతో గద్వాల్ తదితర దూర ప్రాంతాలకు ధాన్యం తరలించాల్సి వస్తుంది. ధాన్యం తరలించే కాంట్రాక్టర్ లారీలను సమకూర్చి తరలించినా, ధాన్యం దించే హమాలీల కొరత తదితర కారణాలతో లారీలు సకాలంలో రావడం ఆలస్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. సకాలంలో అధికారులు స్పందించి ధాన్యం తరలించి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం తరలించేందుకు చర్యలు

రికార్డు స్థాయిలో కేంద్రాలకు ధాన్యం తరలిరావడంతో ధాన్యం తరలింపు ఆలస్యమవుతుంది. రెండు రోజుల్లో కేంద్రాల్లోని ధాన్యం తరలిస్తాం. ఇప్పటి వరకు జిల్లాలో 42 లక్షల గన్నీ బస్తాలు రైతులకు అందజేశాం. 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం (29 లక్షల బస్తాలు) కొనుగోలు చేశాం. బాయిల్డ్ రైస్ గోడౌన్‌లు దూరంగా ఉండటంతో తరలింపు కొంత ఆలస్యం అవుతుంది.

– సైదులు, డీఎం, సివిల్ సప్లై, నారాయణపేట

రోజుల తరబడి పడిగాపులు

వరి ధాన్యం విక్రయించేందుకు మొదట్లో గన్నీ బ్యాగుల కోసం వారం రోజుల పాటు తిరిగాం. తీరా బస్తాలు ఇవ్వడంతో ధాన్యం తూకం వేసి కవర్లు కప్పి ఉంచాం. అధికారులు సకాలంలో ధాన్యం తరలించాలి.

– అంజప్ప, రైతు దామరగిద్ద

జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



జర్నలిస్టు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నారాయణపేట రూరల్: మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సాయం చెక్కులను శుక్రవారం ప్రెస్ అకాడమీలో అందజేసింది. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలో మృతి చెందిన యాదగిరి మహేష్ (నారాయణపేట), రాఘవేందర్ (మక్తల్) జర్నలిస్టు కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కుతో పాటు, ఐదు సంవత్సరాల వరకు నెలకు రూ. 3వేల ఫించన్ అందించే పత్రాలను ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, రఘుపతి, శ్రీనివాస్, రాజేష్‌కుమార్, సంజీవ్ ప్రకాష్, విఠోబా పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు వినతి..

జర్నలిస్టులకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లాశాఖ తరపు వినతిపత్రం అందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ రచనల్లో పదును పెంచేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. జూన్ మొదటి వారంలో తరగతులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



మరికల్: జమ్మూలో పాకిస్తాన్ కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు మండల కేంద్రంలో అఖిలపక్షం నాయకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళ్లులర్పించారు. అనంతరం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, విద్యార్థి, యువక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌంటెన్ సైక్లింగ్ విజేతలకు సన్మానం



అనూషను అభినందిస్తున్న గోపాలం

మాగనూర్(మక్తల్): రాష్ట్రస్థాయి మౌంటెన్ సైక్లింగ్ 10 కిమీ పోటీలో నర్వ మండలం రాయికోడ్ గ్రామానికి చెందిన అనూష గోల్డ్ మెడల్, సౌత్ జోన్ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మక్తల్‌లో శుక్రవారం విజేతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత పీఈటీ గోపాలం మాట్లాడుతూ.. ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న బాలబాలికలు క్రీడల్లో మెరుగైన శిక్షణ పొంది రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రమేష్‌కుమార్, నీలి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్రోఫోన్ వితరణ

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ఈశ్వర ఆంజనేయస్వామి ఆలయానికి శుక్రవారం గ్రామానికి చెందిన వల్లభదాస్ రాములుగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు మైక్, మైక్‌స్టాండ్, తాళాలు, మైక్రోఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలకు దూరంగా ఉండాలి

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్ తెలిపారు. దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో పి.బాలకిష్టయ్యగౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులో మ్యాజిక్ షో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండి సైన్స్‌ను శాస్త్ర విజ్ఞానాన్ని నమ్మాలన్నారు. మారుతున్న టెక్నాలజీ అనుకూలంగా విద్యార్థులు మెలగాలని తెలిపారు. పేద విద్యార్థుల కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కడియాల మోహన్, కథలయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీపాద్

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యం తగదని, పనుల్లో వేగం పెంచి కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే వర్షాకాలంలో నిర్వహించే వన మహోత్సవానికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలని, రైతుల పొలాల్లో భూమి చదును చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నర్సరీల ఏర్పాటు, ఉపాధి కూలీలకు టెంట్లు, తాగునీరు, కూలీల పెంపు, పనుల పురోగతి, తదితర విషయాలపై చర్చించారు. నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ పీఓ రఘు, పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఆర్‌ఎం భానుశ్రీ

గోపాల్‌పేట: పొలాల్లో తరచుగా వేసే రసాయనిక ఎరువులు కాకుండా పట్టి రొట్ట, వేపాకు, కానుగ ఆకును దుక్కిలో కలిపి దున్నడం, తక్కువ కాలం పంటలు, వాతావరణానికి అనుగుణంగా పంటమార్పిడి చేయడం ద్వారా రైతులు ఎక్కువ దిగుబడి గడించడంతో పాటు భవిష్యత్‌లో వేసుకునే పంటలకు భూసారం ఎక్కువగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్, శాస్త్రవేత్త భానుశ్రీ అన్నారు. గురువారం మండలంలోని పొలికెపాడులో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను మోతాదుకు మించకుండా వాడాలని సూచించారు. సేంద్రియ, పశువుల పేడ, వానపాముల ఎరువులు వేసి పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ పామాయిల్ పంట సాగు, దిగుబడి, మార్కెటింగ్ వివరాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ రఘు, ఉపాధ్యక్షుడు రాములు, కాంగ్రెస్ ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

నారాయణపేట: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ రాంకిషన్ ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి, రక్తహీనత గల తల్లులకు, ఎమర్జెన్సీ బ్లడ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవసరమయ్యే పేషెంట్లకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంటుందన్నారు. ప్రాణాపాయ స్థితిలో వారికి పునర్జన్మ ప్రసాదించిన వారు కావాలన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వలంటీర్లు, డోనర్లను అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు నరసింహ జీవన్, రాఘవేంద్ర, సుందరిదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ప్రభావతి, ఎన్‌ఓఏ ప్రెసిడెంట్ కవి, జనరల్ సెక్రటరీ రాజు, షబ్బీర్, ఓం ప్రకాష్, హన్మంతు, విజయకుమార్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, గడినాడ కన్నడ సంఘం నాయకుడు అమర్‌కుమార్ దీక్షిత్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జాతీయ రహదారి 167పై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించి నాలుగు సంవత్సరాలు అవుతున్న ఇంకా పూర్తి చేయలేదన్నారు. పురాతన బ్రిడ్జిపై నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్నందునా ట్రాఫిక్‌జాం సమస్యలు ఏర్పడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర సరిహద్దు నుంచి రాయచూర్ పట్టణం వరకు అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయంపై కర్ణాటక ముఖ్యమంత్రికి గడినాడ కన్నడ సంఘం నాయకులతో కలిసి విజ్ఞప్తిపత్రం పంపించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



అక్రమంగా ఇసుక తరలించిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

కొత్తపల్లి: మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లీపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని నర్సింములు, డ్రైవర్ జాకిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదే



హన్వాడ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగు వచ్చిందని భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో హన్వాడ మాజీ ఎంపీటీసీ యాదయ్య, హన్వాడ మండలం అచ్చుంట తండా మాజీ సర్పంచ్ రాందాస్, అయోధ్యనగర్ మాజీ సర్పంచ్ సురేష్, ఎర్రగట్టు తండా మాజీ సర్పంచ్ మన్యనాయక్ లతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ జరగలేదని, రైతుబంధు, రైతు బీమా లేదని, కనీసం పండించిన పంట కొనడం దిక్కు లేదని ఆరోపించారు. గ్రామాల్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చినప్పుడు ఎన్నికల హామీలపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ సీఎంగా ప్రజలకు మంచి పాలన అందిస్తారన్నారు. కార్యక్రమం లో హన్వాడ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ నరేందర్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడుఅన్వర్, సీనియర్ నాయకులు చెన్నయ్య, కొండా లక్ష్మయ్య, శ్రీనివాసులు, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ రుణాలు మంజూరు చేయిస్తాం'

వనపర్తి టౌన్: విశ్వకర్మ ద్వారా శిక్షణ పూర్తి చేసుకొని రుణం పొందని అర్హులకు బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణం ఇప్పిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ భరోసా కల్పించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బజార్, కుమ్మరి వీధి, బాల్‌నగర్‌లో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాలనీల్లో చెత్త కుప్పలు, డ్రెయినేజీలు, దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు చెప్పడంతో మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోపినాథ్‌యాదవ్, వెంకటేష్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, బొడ్డుపల్లి కొండన్న, మొరార్జీనాయక్, సూర్యవంశం శ్రీను, పట్టణ ప్రధాన కార్యదర్శి దంతోజు నవీన్, ఉపేందర్‌యాదవ్, శివ, గుణగంటి నరేందర్, పవన్, చింటు తదితరులు పాల్గొన్నారు

నయా ఫాసిజం అత్యంత ప్రమాదకరం



మాట్లాడుతున్న రాములు

మహబూబ్ నగర్ న్యూటౌన్: దేశ ప్రధాని మోదీ అనుసరిస్తున్న నయా ఫాసిజం అత్యంత ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నాటి సోవిట్ సోషలిస్ట్ ఎర్రసైన్యం ఫాసిజంపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జనరల్ బాడీ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానాలను భూస్థాపితం చేయడం ద్వారా ఎర్రజెండా నీడలో రష్యా సోషలిజం ఏర్పాటైందని గుర్తు చేశారు. కమ్యూనిస్టు దేశాలను కూల్చి తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థను తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలను నాటి ఎర్రజెండా తిప్పి కొట్టిందన్నారు. పెట్టుబడిదారీ దేశాలు, తమ వ్యవస్థ 10 ఏళ్లకు ఒకసారి సంక్షోభంలోకి వెళ్తాయని నాడు మార్క్స్ అన్న విషయం నేడు అనేక దేశాలలో చూస్తున్నామన్నారు. పుల్వామ దాడి మొదలుకొని నేటి కాశ్మీర్‌లో 28 మంది మరణించడం వరకు పూర్తి బాధ్యత బీజేపీదే అన్నారు. ఇప్పటికైనా పాక్ దుశ్చర్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే అన్నారు.

మరమ్మతుకు నోచుకోని కల్వర్టులు

- ధ్వంసమైన రక్షణ గోడలు
- అదుపు తప్పితే పెను ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



కన్మనూర్ శివారులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మరికల్: మండలంలోని కెనాల్‌పై నిర్మించిన కల్వర్టులకు మరమ్మతులు చేపట్టక ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహనదారులు భయాందోళనలో ప్రయాణాలు చేస్తున్నారు. అధికారులకు ఎన్నోమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అదుపుతప్పితే కెనాల్‌లోకి..

మండల పరిధిలోని కన్మనూర్, గాజులయ్య తండా మధ్యన కెనాల్‌పై నిర్మించిన కల్వర్టు వాహనాల రాకపోకలకు ధ్వంసమైంది. వాహనం అదుపు తప్పితే కెనాల్‌లోకి దాదాపు 50 అడుగుల లోతులోకి పడిపోవాల్సిందే. కల్వర్టు రక్షణ గోడ పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు గ్రామస్తులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదనే ఆరోపిస్తున్నారు.

పదేళ్లుగా నోచుకోని మరమ్మతు

గత పదేళ్ల నుంచి మండల పరిధిలోని కల్వర్టులు మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. అదే విధంగా మరికల్ నుంచి కన్మనూర్ మీదుగా నర్వ వరకు ఉన్న రహదారిపై అనేక కల్వర్టులు మరమ్మతులకు నోచకోవడం లేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కల్వర్టలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.